సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి : గడిచిన సంవత్సరపు అనుభవాలు, జ్ఞాపకాలతో నూతన ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. నూతన ఏడాదిలో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని, అభివృద్ధిబాటలో నడవాలని ఆయన అభిలషించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శ్రీకాంత్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం రోజున తనను కలవడానికి వచ్చే కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, అధికారులు పూలమాలలు, బొకేలు, శాలువలు, కేకులు తీసుకురావద్దని, నిరాడంబరంగా నూతన సంవత్సర కార్యక్రమాన్ని జరుపుకుందామని శ్రీకాంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

వీరబల్లి : గ్రామ, వార్డు, సచివాలయాల పరిధిలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. వీరబల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన గ్రామ వార్డు వలంటీర్ల సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలు గురించి ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. రాబోయే రోజులలో వాలంటరీ వ్యవస్థను పర్మినెంట్ చేస్తూ వారికి వేతనాలు కూడా పెంచే యోచనలో ముఖ్యమంత్రి ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఫించన్ల వెరిఫికేషన్ ఉన్నప్పుడు పింఛన్లు తీసేశారని టీడీపీ వారు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి వారికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ



డైరీని విడుదల చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారులు

రాయచోటిటౌన్ : అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి చేతుల మీదుగా పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరించారు. శనివారం రాయచోటి జిల్లా విద్యాశాఖ వారి కార్యాలయంలో పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రాజులతో కలసి డైరీని విడుదల చేశారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా విద్యాశాఖాధికారి రమేష్, వైఎస్సార్ కడప జిల్లా వైద్యాధికారి దేవరాజు, వైఎస్సార్ కడప ఏఎంవో ధనలక్ష్మి, పీఆర్‌టీయూ అన్నమయ్య జిల్లా వర్కింగ్ కమిటీ ప్రసిడెంటెంట్ నాగేంద్రరెడ్డి,ఉపాధ్యక్షులు రెడ్డెయ్య రాజు, రాజంపేట మండల బాధ్యలు రామ్మోహన్ రాజు, రామాపురం మండల బాధ్యులు వెంకటపతి రాజు, తదితరులు పాల్గొన్నారు.
































క్లుప్తంగా

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

సంబేపల్లె : మండలంలోని అడవికమ్మపల్లె గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కోవిడ్ నియమ నిబంధనలు పాటిస్తూ స్వామి వారిని దర్శించుకున్నారు.అర్చకులు వీరికి తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



రైల్వేకోడూరు : జిల్లా ప్రజలకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు శనివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023 సంవత్సరంలో ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని ఆయన పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వీరబల్లి: మండలంలోని వైఎస్సార్‌సీపీనాయకుడు వీరనాగిరెడ్డి యూత్ ఆధ్వర్యంలో రాజంపేట శాసన సభ్యులు మేడా మల్లికార్జున రెడ్డి శనివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వీరబల్లి జెడ్పీటీసీ శివరాంగౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

శుభ్రతకు పెద్దపీట వేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పంచాయతీ అధికారి ధనలక్ష్మి

రామాపురం : గువ్వలచెరువులోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ) కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయితీ అధికారి ధనలక్ష్మి అన్నారు. శనివారం గువ్వలచెరువు, కసిరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. గువ్వలచెరువు గ్రామ పంచాయితీలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించారు. వర్మీకంపోస్టు తయారీ విధానాన్ని అమలులోకి తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని సూచించారు. అనంతరం సచివాలయంలోని రికార్డులను, నవరత్నాలు సంబంధించిన పోస్టర్లను పరిశీలించారు. సిబ్బంది యూనిఫాం ధరించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.వీరికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని విస్తరణ అధికారికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హైదర్‌వలి, పంచాయితీ కార్యదర్శి ఉషారాణి, కసిరెడ్డిగారిపల్లె, గువ్వలచెరువు గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయంసిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి ఆటలు పోటీలు

పెనగలూరు : మండలంలోని సచివాలయ సిబ్బందికి శనివారం నుంచి ప్రత్యేకంగా ఆటలు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. గెలుపొందిన ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు సర్పంచ్ చిన్న వెంగల్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి మహిళకు గాయాలు

ములకలచెరువు: ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడడంతో ఒక మహిళకు తీవ్రగాయాలయ్యా యి. సత్యసాయి జిల్లా తనకల్లు మండలం వడ్డిపల్లెకు చెందిన జే.ప్రమీల తన కుమారుడు విష్ణుతో కలిసి ద్విచక్రవాహనంలో శనివారం ములకలచెరువుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ములకలచెరువు జెడ్పీ హైస్కూల్ మలుపు వద్ద అదుపుతప్పి కిందడటంతో ప్రమీలకు తీవ్రగాయాలయ్యాయి.

స్నేహపూర్వక వాతావరణంలో చదువుకోవాలి

మదనపల్లె సిటీ: జూనియర్స్, సీనియర్స్ అనే బేధం లేకుండా అందరూ కలిసి స్నేహపూర్వక వాతావరణంలో చదువుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు.శనివారం కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థినులకు సీనియర్ విద్యార్థినులు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే ఉల్లాసంగా జరుపుకున్నారు. ఆమె మాట్లాడుతూ కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

మంచు.. ప్రమాదపుటంచు

జాగ్రత్తలు పాటిస్తే సురక్షిత ప్రయాణం



రాజంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై దట్టమైన పొగమంచులో వాహనాల రాకపోకలు

రాజంపేట టౌన్ : చలితీవ్రత రోజు రోజుకు పెరుగుతోంతోంది. ఇటీవల కాలంలో నిత్యం మంచు కురుస్తోంది. వేసవి, వర్షాకాలాలకు భిన్నంగా శీతాకాలం పగటిపూట వెలుగు తక్కువగా ఉంటుంది. దీనికి తోడు ఉదయం 8–30 గంటల వరకు పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాలను మంచుదుప్పటి కప్పేస్తోంది. అందువల్ల వాహదారులు వాహనాలను నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరికి వచ్చినంత వరకు ఎదురుగా వచ్చే వాహనం కనిపించని పరిస్థితి నెలకొంది. అందువల్ల వాహనదారులు మంచు కురిసే సమయంలో వాహనాలను నెమ్మదిగా నడపాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. మంచు తీవ్రత అధికంగా ఉంటే మంచు తగ్గే వరకు వాహనాలను ఖాళీ ప్రదేశాల్లో పెట్టుకుంటే మంచిదని అధికారులు చెబుతున్నారు.

ప్రమాదాలు ఎందువల్ల జరుగుతాయంటే..

- దట్టంగా అలుముకున్న మంచు వల్ల వాహనదారులకు దారి సరిగా కనిపించక పోవడం.
- రహదారి సరిగా కనిపించకున్నా వాహనాన్ని వేగంగా నడపడం.
- ఎదురుగా ఉండే డివైడర్లను ఢీకొనడం..
- రహదారి కనిపించడం లేదని వాహనాలను రోడ్డులోనే నిలపడం..
- డ్రైవర్లకు సరైన నిద్ర లేక పోవడం. మద్యం మత్తులో ఉండటం వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంది.

ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

- దట్టమైన మంచు కురిసే సమయంలో వీలైనంత వరకు వాహనాలను నడపకుండా ఉంటే మంచిది. మార్గ మధ్యలో మంచు తీవ్రత పెరిగితే సుర‌క్షితమైన ప్రాంతంలో వాహనాన్ని పార్కింగ్ చేయడం మంచిది.
- వాహనాలను నెమ్మదిగా నడపడంతో పాటు ఎదురుగా వచ్చే వాహనదారులు గుర్తించేలా వాహనాల హెడ్‌లైట్స్ ఆన్ చేసి ఉంచాలి.
- మంచు కురుస్తున్నా తప్పనిసరిగా ప్రయాణించాల్సిన పాలు, న్యూస్ పేపర్ తరలించే రవాణా వాహనాలకు, వ్యవసాయ కూలీలను తరలించే ట్రాక్టర్లు, ఆటోలు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు విధిగా ముందు, వెనకవైపు రేడియం స్టిక్కర్లు అతికించాలి.
- వాహనానికి అమర్చిన రెడ్ సిగ్నల్స్, బ్రేక్ సిగ్నల్స్ సరిగా పనిచేస్తున్నది లేనిది ప్రయాణానికి ముందే సరిచూసుకోవడం మంచిది. రహదారి మలుపుల్లో ఈ లైట్స్ ఎదుటివారిని అప్రమత్తం చేస్తాయి.
- మంచు కురిసే సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఎదురుగా వెళ్ళే వాహనాన్ని అధిగమించే ప్రయత్నం చేయకూడదు.
- మంచు కురిసే సమయంలో రహదారులు తడిగా ఉంటాయి, అందువల్ల ద్విచక్ర వాహనదారుల సడన్‌గా బ్రేక్‌వేస్తే జారిపడే అవకాశముంటుంది. నెమ్మదిగా వెళితే సడన్ బ్రేక్ వేసినా ప్రమాదం నుంచి బయటపడవచ్చు.

శివాలయంలో హుండీ ఆదాయం లెక్కింపు

పుల్లంపేట : పుల్లంపేటలోని శ్రీ పర్వతవర్ధినీ శాంతి లింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం దేవాదాయశాఖ ఈఓ కొండారెడ్డి ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించారు. రూ. 1,26,303లు వచ్చిందని ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భారతి, సభ్యులు సురేష్, మల్లయ్య, కృష్ణ, ఆలయ ఇన్‌స్పెక్టర్ శివయ్య, శ్రీను, ఆలయ పూజారి ఈశ్వరరావు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత కోనంపేట జట్టు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లె మండలం, కోనంపేటలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో శ్రీ వెంకటేశ్వర యూత్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమల వెంకటేశ్వర, బాలాజీలు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఏడు టీమ్‌లు పాల్గొనగా కోనంపేట టీమ్ విజేతగా, దప్పేపల్లి టీమ్ రన్నర్స్‌గా నిలిచాయి. విన్నర్స్‌కు రూ. 2 వేలు, రన్నర్స్‌కు రూ. 1000 నగదు బహుమతి, మెమెంటోలు అందజేశారు. సర్పంచ్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఆనందాన్ని పొందొచ్చన్నారు. కార్యక్రమంలో సంఘ సేవకులు రామకృష్ణయ్య, విడ్స్ ప్రతినిధి పవన్ కుమార్, యువకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ బుగ్గిపాలు



మాట్లాడుతున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరెడ్డి

రాజంపేట టౌన్ : మాదకద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్ బుగ్గిపాలవుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఇన్‌స్పెక్టర్ శ్రీహరి రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.పురుషోత్తం ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీహరి రెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనేక మంది విద్యార్థులకు భవిష్యత్తుపై సరైన అవగాహన లేక చెడు అలవాట్ల పట్ల ఆకర్షితులవుతుంటారని, అదే వారి జీవితాన్ని పాడు చేస్తుందన్నారు. కొంతమంది సరదా కోసం మాదకద్రవ్యాలను తీసుకుంటారని, తరువాత వాటికి బానిసలైపోతారని తెలిపారు. విద్యార్థి దశలో విద్యార్థులకు చదువు తప్ప మరే వ్యాపకం ఉండకూడదన్నారు.తల్లిదండ్రుల కలలను సాకారం చేసినప్పుడే మనిషి జన్మకు సార్థకత లభించినట్లన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.పురుషోత్తం, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, సీ.విజయభాస్కర్, ఆధ్యాపకులు వెంకటనరసయ్య, ఆదినారాయణ, శోభన్‌బాబు, వీ.పార్వతి, ఎస్.చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

అధికారులతో ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి

గాలివీడు : ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజా సమస్యలు తీర్చేందుకు ముందుండాలని ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎంపి మిథున్ రెడ్డిల సహకారంతో ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిద్దామని ఆయన అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శేఖర్ నాయక్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, ఎంపీడీఓ శేఖర్ నాయక్, డీటీ తిమ్మారెడ్డి హాజరయ్యారు.. ముందుగా అజెండాలో పొందుపరిచిన అంశాలను.. శాఖల వారీగా పురోగతి వివరాలు, పనులు అమలవుతున్న తీరును నూతన సభ్యులకు వివరించారు. సమావేశానికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. గాలివీడు, నూలివీడు పీహెచ్‌సీ నుంచి రాధా మాధవి, దేవేందర్‌రెడ్డిలు వైద్య ఆరోగ్యశాఖ గురించి వివరించారు. గాలివీడు, నూలివీడు పీహెచ్‌సీలకు 100 రాపిడ్ కిట్లు వచ్చాయన్నారు. కరోనా మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ చెప్పారు. అనంతరం ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణపై ప్రజా ప్రతినిధులు కూడా వారివారి గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని అన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో తాగునీటి పైపులైన్ పనులు పూర్తి చేయిస్తామన్నారు. మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ వారు వివరించారు. రెవెన్యూ అంశాలను డిప్యూటీ తహసీల్దార్ తిమ్మారెడ్డి తెలియజేశారు. పంచాయతీ రాజ్ జేఈ రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలో నూతన సచివాలయాల భవనాలు, ఆర్‌బీకే, హెల్త్ క్లీనిక్, పాల కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీ కేంద్రాల పనులు సాగుతున్నాయన్నారు. సిరికల్చర్, ఐసీడీఎస్, విద్యాశాఖల అధికారులు తమ నివేదికలను అందించారు. పేద ప్రజలకు ఉపాధిహామీ పథకం వరం లాంటిదని, గ్రామాల్లో 100 రోజులు పనిదినాలు పూర్తయ్యేలా చూడాలని, రైతులకు ఉపయోగపడేలా పనులు అనుమతులు మంజూరు చేయించుకొని పనులు చేపట్టాలని ఎంపీపీ అన్నారు.

ఆటోనగర్ ఏర్పాటు చేయాలని వినతి



వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న వర్క్‌షాపుల యజమానులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరులో ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వర్క్ షాపుల యజమానులు కోరారు.శనివారం ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పల శంకరయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జిల్లా వ్యవసాయసలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డిలకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆటోనగర్ ఏర్పాటుకు కృషిచేసి తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసుల దృష్టికి తీసుకువెళ్లి ఆటోనగర్ ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆకేపాటి రంగారెడ్డి, రమణారెడ్డి, రాజారెడ్డి, ప్రతాప్ రెడ్డి, సుబ్రమణ్యం, వర్క్‌షాపుల యజమానులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

పీలేరు : అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ వద్ద ఎంఈవో బాలాజీ నాయక్ చేతుల మీదుగా డైరీ, క్యాలెండర్, స్టిక్కర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ అక్రమ్‌బాషా, జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, వేణుగోపాల్, జి. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల మురుగు సమస్యకు పరిష్కారం

- రూ.32 లక్షలతో డ్రెయిన్ నిర్మాణం

మదనపల్లె : పట్టణ నడిబొడ్డున దశాబ్దాల కాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న మురుగు సమస్యకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశాలతో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. శనివారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని బందరు మిఠాయి దుకాణం నుంచి బాహుదాకాలువలోకి రూ.32లక్షల వ్యయంతో 190 మీటర్ల మురుగునీటి కాలువ నిర్మాణపనులకు ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో 22వవార్డు కౌన్సిలర్ ముబీనా, నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లాఖాన్, కౌన్సిలర్ మేస్త్రీశ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ, వీఎస్ఆర్ గ్రాండ్ సుధాకర్‌రెడ్డి, సింహపురి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన సాఫ్ట్‌బాల్ పోటీలు



గెలుపొందిన జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు కొనసాగుతున్నట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలలో ఉమ్మడి జిల్లాల క్రీడా విద్యార్థులు పాల్గొన్నారు. పీడీల పర్యవేక్షణలో శనివారం జరిగిన పోటీల్లో బాలురు, బాలికల విభాగంలో కడప జిల్లా జట్లు మొదటి స్థానంలో, గుంటూరు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. మొదటి స్థానంలో నిలిచిన జట్లకు చౌడేశ్వరమ్మ ట్రస్టు వాళ్లు రూ10 వేల నగదును అందజేయగా రెండో స్థానంలో నిలిచిన జట్లకు వీరపునాయునిపల్లెకు చెందిన రిటైర్డ్ పీడీ వెంకటరెడ్డి రూ.5 వేల నగదును అందజేశారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి



సిద్దవటం : ఈ-పంట నమోదు చేస్తున్న బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు

సిద్దవటం : రబీలో సాగు చేసిన అన్ని రకాల పంటలకు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజు తెలిపారు. శనివారం ఆయన సిద్దవటం లోని ఎర్రగొండు నాగమునిరెడ్డి అనే రైతు సాగు చేసిన వేరుశనగ పంటలో(టిఏజి–24) సర్వేనెంబర్ 33, 36 లో ఖాతానంబర్ 523లో, 2.32 ఎకరాల విస్తీర్ణంలో ఈ-పంట నమోదు ప్రక్రియ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రయోజనాలను పొందాలంటే ప్రతి రైతు ఈ-పంట నమోదు చేయించు కోవాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఆయన సిద్దవటం రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు శివకుమార్, ఆర్‌బీకే మిత్ర కే.శ్రీదర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న వెంగల్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ విజయ్ రెడ్డి

పెనగలూరు : పెనగలూరు జిల్లాపరిషత్ హైస్కూల్ క్రీడామైదానంలో శనివారం ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు, పెనగలూరు సర్పంచ్ దేపూరు చిన్న వెంగల్ రెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యుడు, మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని తెలిపారు. ఈ టోర్నమెంటులో గెలుపొందిన వారికి మొదటి బహుమతి కింద రూ.1 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.50 వేలు అందించనున్నారు. చిన్న వెంగల్ రెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రికెట్‌తోపాటు మరి కొన్ని ఆటలు పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు.ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ వరప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రతాప్ రెడ్డి, పెంచలకోన ట్రస్టు మాజీ డైరెక్టర్ గణపతి రెడ్డి రంగారెడ్డి, తిరుపతి క్లాస్–1 కాంట్రాక్టర్ గుండాల్ రెడ్డి, పెనగలూరు మండల వైఎస్సార్ సిపి కన్వీనర్ కేతా చక్రపాణి, సిద్దవరం వెంకటేశ్వరరెడ్డి, బండి సానారెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ సందర్శకులపై ఆంక్షలు షురూ



చెక్‌పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామమోహన్

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నూతన ఏడాది వేడుకలు జరుపుకునేందుకు వచ్చే సందర్శకులపై పోలీసుల ఆంక్షలు శనివారం సాయంత్రం నుంచి అమలులోకి వచ్చాయి. ఘాట్‌రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా, కుటుంబాలతో వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కొండకింద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఎస్ఐలు సుకుమార్, రామమోహన్, సిబ్బంది విధులు నిర్వహిస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మద్యం తీసుకెళ్లడంపై నిషేధం పెట్టగా వాటికోసం తనిఖీలు చేస్తున్నారు. బైక్, ఆటోలను కొండపైకి వెళ్లడం రెండురోజుల నిషేధం విధించారు. సోమవారం వరకు పోలీసు చెక్‌పోస్టు కొనసాగనుంది. సందర్శకుల భద్రతకు చర్యలు తీసుకొంటున్నారు.

ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని నిరసన

బి.కొత్తకోట: 15ఏళ్ల క్రితం మూసివేసిన ఆర్టీసీ డిపోను మళ్లీ ఏర్పాటు చేయాలని కోరుతూ కోసం స్థానిక సీపీఐ నాయకులు, కార్యకర్తలు శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. డిపో లేకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి డిపో ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్.సలీంబాషా కోరారు. సీనియర్ నాయకులు బషీర్‌ఖాన్, సమీవుల్లా, గంగులప్ప, బాలకృష్ణ, కదిరప్ప, మస్తాన్, గంగాద్రి పాల్గొన్నారు.

డిజిటల్ ధ్రువపత్రాలు అందజేయండి

డీటీఓ మహబూబ్‌బాషా

బి.కొత్తకోట : ఉద్యోగ విరమణ చేసి ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న పెన్షనర్లు ఏటా సమర్పించాల్సిన వార్షిక ధ్రువీకరణ పత్రాలను డిజిటల్ విధానంలో జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా సమర్పించాలని జిల్లా ఖజానా, అకౌంట్స్ ఆఫీసర్ యస్.మహబూబ్‌బాషా శనివారం క ప్రకటనలో కోరారు. ఈ వివరాలను సమర్పించేందుకు జనవరి ఒకటి నుంచి ఫిబ్రవరి 28 వరకు గడువు ఉందని తెలిపారు. పెన్షన్లు పొందుతున్న వారు ఆధార్, పెన్షన్ పుస్తకం, బ్యాంకు ఖాతా నంబర్, ఫోన్ నంబర్లను సమర్పించాలని తెలిపారు. బయోమెట్రిక్ సమస్య ఉన్నవాళ్లు నేరుగా కార్యాలయంలో వివరాలు అందించాలని కోరారు. వివరాలకు ఆయా ప్రాంతాల జిల్లా, ఉప ఖజానా కార్యాలయాల్లో లేదా మీసేవ కేంద్రాలు, పెన్షన్‌దారుల సంఘ కార్యాలయాలను సంప్రదించాలని కోరారు.

మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

పీలేరురూరల్ : బీసీ మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని ఏపీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ రాయల్ బాబురాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 డిసెంబర్ 31వ తేదీన 40 సిఫార్సులతో కూడిన మండల కమిషన్ నివేదిక పార్లమెంట్‌లో సమర్పించారన్నారు. పదేళ్ల అనంతరం వి.పి. సింగ్ ప్రధాన మంత్రిగా ఉండగా విద్యా ఉద్యోగ నియామకాల్లో 27 శాతం రిజర్వేషన్ కల్పించి ఒక సిఫార్సు మాత్రమే అమలు పరిచారన్నారు. మిగిలిన 39 సిఫార్సులు ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు గుర్రం నారాయణ, వెంకటరమణ, రమేష్, మహేష్, పురుషోత్తం, మురళి, చంద్ర, జనార్ధన పాల్గొన్నారు.

నయా సాల్ జోష్

రాజంపేట టౌన్ : కొత్త సంవత్సరాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకుగాను ప్రజలు తమకు కావాల్సిన వస్తుసామాగ్రిని కొనుగోలు చేసేందుకు శనివారం పెద్దఎత్తున పట్టణానికి తరలి వచ్చారు. దీంతో అన్ని రహదారులు రద్దీగా మారాయి. ఆర్ఎస్‌రోడ్డు, పాతపోలీస్‌లైనువీధి, నాగులమానువీధి, బంగ్లాళ్ళవీధి, మెయిన్ బజారుల్లో పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు కష్టపడాల్సి వచ్చింది. నూతన ప్రజలు ఎక్కువగా కేక్‌లను, కొత్త దుస్తులు, పూలు, పండ్లు కొనుగోలు చేసేందుకు వచ్చారు. దీంతో ఆయా దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది.

న్యూఇయర్‌కు గ్రాండ్ వెల్‌కం

కొత్త సంవత్సరానికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అర్ధరాత్రి 12 గంటలు కాగానే వివిధ వీధుల్లోని యువకులు బయటకు వచ్చి హాపీ న్యూఇయర్ అంటూ తోటి మిత్రులు, బంధువులతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. అలాగే కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. కొత్త సంవత్సరం ఆరంభమైన వెంటనే చాలా మంది తమ బంధువులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ఫోన్‌లు చేసి న్యూఇయర్ విషెస్ చెప్పారు.

పెనగలూరులో..

పెనగలూరు : పెనగలూరు మండలంలో నాయకులు ముందస్తు నూతన సంవత్సర వేడుకలను శనివారం నిర్వహించారు. 25 కేజీల కేక్‌ను కట్ చేశారు. పెనగలూరు సర్పంచ్ చిన్న వెంగల్‌రెడ్డి నూతన సంవత్సరం, పుట్టినరోజు సందర్భంగా కార్యకర్తలు ఈ కేక్‌ను ఏర్పాటు చేశారు.

రాజంపేట కోర్టు ప్రాంగణంలో..

రాజంపేట : రాజంపేట కోర్టు ప్రాంగణంలోని రాజంపేట బార్ అసోసియేషన్ కార్యాలయంలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలను శనివారం నిర్వహించారు. మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్‌వీవీ మురళీకృష్ణ, సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి, జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి న్యూఇయర్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ కె.శరత్‌కుమార్‌రాజు, నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నరసింహులుతో అలాగే నందలూరు, రాజంపేట, రైల్వేకోడూరుకు చెందిన సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటం లోని శ్రీ సాయిహైస్కూల్, శ్రీ నలంద హైస్కూల్ లలో శనివారం నూతన సంవత్సరం ముందస్తు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రెండూ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి నూతన సంవత్సరం కేక్‌ను కట్ చేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్లు బాలుగారి వెంకటసుబ్బయ్య, పోలు వెంకటసుబ్బయ్య, ప్రధానోపాధ్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజంపేట టౌన్ : కేక్‌లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



పెనగలూరు : కేక్‌ను కట్ చేస్తున్న దృశ్యం



రాజంపేట : కేక్‌ను కట్ చేస్తున్న న్యాయమూర్తులు

శ్రీ మండెం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు



చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె గ్రామంలో వెలిసిన శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వీరికి తీర్థప్రసాదాలు అందజేశారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

నందలూరు(రాజంపేట) : మూడేళ్లలో మండలంలో అధికంగా శాశ్వత అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి వెల్లడించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలోని తన చాంబరులో ముందస్తుగా న్యూ ఇయర్ కేక్ కట్‌చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, జడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

రూరల్ అర్బన్ మిషన్ కింద రూ.100కోట్లతో శాశ్వత అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న అన్ని పథకాలను అర్హులైన వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్, నాగిరెడ్డిపల్లె సర్పంచి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నడివీధిసుధాకర్, ఆకేపాటి రమేష్ రెడ్డి, తుమ్మలశ్రీధర్‌గౌడ్, హస్తవరం సుబ్బరామిరెడ్డి,హనుమంతుపవన్, అన్నంనాగేంద్ర, పెనుబాలనాగసుబ్బయ్య, సోమిశెట్టి ప్రభాకర్, పణతల రామచంద్ర, కాకిచంద్ర, ఏజీపీ షమీ, మైనార్టీనాయకులు మన్సూర్, షావల్లి, బీసీ నాయకులు హిమగిరియాదవ్, ఓర్సు శ్రీను, భారతాలనారాయణ, ఎంపీడీఓ సౌభాగ్య, తహసీల్దారు ఉదయశంకర్‌రాజు, ఎంపీడీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నందలూరు ఎంపీపీ చాంబరులో కేక్ కట్‌చేస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

ఓటు హక్కు నమోదు చేయించుకోండి

ఓబులవారిపల్లె : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పకుండా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పీర్ మున్ని అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ గతంలో 18 సంవత్సరాలు నిండి అనివార్య కారణాలతో ఓటు నమోదు చేసుకోకపోయిన వారు కూడా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. అంతే కాకుండా ఓటర్ కార్డుకు ఆధార్ కార్డు లింక్ చేయించుకోవాలని చెప్పారు. రీ-సర్వేలో మండలంలో వైకోట గ్రామాన్ని ప్రభుత్వం ఎంపిక చేసిందని, గ్రామాల రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, రీసర్వే నిర్వహణకు సహకరించాలని తహసీల్దార్ పీర్ మున్ని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ పీర్ మున్ని

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట, సిద్దవటం, నందలూరు మండలాలలో ఆదివారం) నూతన సంవత్సరం సందర్భంగా వేడుకల నిర్వహనకు పోలీసులు విధించిన నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం రాజు హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో సీఐ విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సరం రోజున అక్రమ మద్యం, బైకు రేసులు, గొడవలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

దేవతల చరిత్రను వక్రీకరించిన నరేష్‌ను శిక్షించాలి

రైల్వేకోడూరు అర్బన్ : హిందూదేవతల చరిత్రను వక్రీకరించి అసభ్యంగా మాట్లాడిన బైరి నరేష్‌ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని అయ్యప్పభక్తబృందం, హిందూసంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శివాలయం నుండి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్సై మోహన్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అయ్యప్పస్వామి గురించి నరేష్‌ అలా మాట్లాడడం సిగ్గుచేటన్నారు.కార్యక్రమంలో అదునుకోటనరసింహులు, తోటశ్రీనివాసులు, వెంకటరెడ్డి, మనోహర్, రామలింగయ్య, రమణ, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలి

చిన్నమండెం : బైరి నరేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు రాచవీడు అయ్యప్ప సేవా సమితి సభ్యులు శనివారం ఫిర్యాదు చేశారు. హనుమకొండకు చెందిన బైరి నరేష్ హిందూ సమాజం మీద, హిందూ దేవతల చరిత్రలపై అసభ్యకరంగా మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో రాస్ సమితి సభ్యులు చంద్రశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, ఎం.చంద్రశేఖర్, రామయ్య, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్సైకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

లక్కిరెడ్డిపల్లెలో ర్యాలీ..

లక్కిరెడ్డిపల్లి : అయ్యప్పస్వామిని దూషించిన బైరి నరేష్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని లక్కిరెడ్డిపల్లె అయ్యప్ప దేవస్థానం ట్రస్టు సేవా సమితి వారు డిమాండ్‌చేశారు. శనివారం మూడు రోడ్ల నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బైరీ నరేష్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి దేవస్థానం ట్రస్టు సభ్యులు గురుస్వామి వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, సుధీర్ గంగరాజు, బీజేపీ నాయకులు వెంకటరామరాజు, వినాయక కమిటీ సభ్యులు ఎల్లమంద రమణ, మల్లికార్జున, అయ్యప్ప భక్తులు సురేంద్రరెడ్డి, రమేష్ రెడ్డి, భాస్కర్ రాజ, ఆంజనేయులు, వెంకటరమణ స్వాములు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నందలూరు(రాజంపేట) : హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ సంఘం వారు, అయ్యప్ప స్వామి భక్తులు శనివారం నందలూరు ఎస్ఐ మైనుద్దీన్‌కు పిర్యాదు చేశారు.

గాలివీడు : అయ్యప్ప స్వామి గురించి అనుచితంగా మాట్లాడిన బైరి నరేష్‌ను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ, ఆర్‌ఎస్ఎస్, వీహెచ్‌పీ, అయ్యప్ప భక్తులు గాలివీడు పట్టణంలో గేడు రామాలయం నుండి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. వెంటనే నరేష్‌పై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలని పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలలో వినతి పత్రాలు సమర్పించారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నందలూరు(రాజంపేట) : స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ స్కౌట్స్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నందలూరు క్రీడామైదానంలో వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు గోపిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందలూరు క్రీడలకు ప్రసిద్ధి చెందిందన్నారు. ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, వైఎస్సార్‌సీపీ రైతు జిల్లా ప్రధానకార్యదర్శి గీతాల నరసింహారెడ్డి , మార్కెట్‌కమిటీ మాజీ డైరక్టర్ పులిభాస్కరయ్య, పుత్తాశంకర్, సభ్యులు చంద్రకాంత్, అరవింద్, దినేష్, అభిషేక్, జశ్వంత్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకముందు మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం పోటీలు ప్రారంభించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

సంబేపల్లె : బహిరంగ ప్రదేశాలలో మందు బాబులు మద్యం తాగొద్దని ఎస్ఐ ఎస్ఎండీ షరీఫ్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం ఆయన మండల వ్యాప్తంగా పలు ప్రధాన కూడళ్లలో పోస్టర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే పనులు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. మండలంలోని యర్రగుంట్ల బస్టాప్, గుట్టపల్లె, సంబేపల్లె, దేవపట్ల, నారాయణరెడ్డిపల్లె, మోటకట్లలలోని ప్రధాన కూడళ్లలో పోస్టర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.



యర్రగుంట్ల బస్టాప్ వద్ద పోస్టర్లను ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ షరీఫ్

తాత్కాలిక పార్కింగ్ స్థలం ఏర్పాటు

రాయచోటి అర్బన్ : పట్టణంలోని జీపులు,కార్లు,ఆటోలు నిలుపుకునేందుకు తాత్కాలిక పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్‌రహిమాన్, వైఎస్సార్‌సీపీ నేత మహమ్మద్‌ఖాన్‌లు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానాన్ని పలు వాహనాల యజమానులు పార్కింగ్ స్థలంగా ఉపయోగించడం, విద్యార్థులు అభ్యంతరం చెప్పడంతో వివాదాస్పదమైందన్నారు. మైదానంలో పోలీసులు వాహనాలను నిలుపనివ్వకపోవడంతో వాహనాల యజమానులతో కలసి సమస్యను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి విన్నవించా మన్నారు. ఎమ్మెల్యే జోక్యంతో మైదానంలో ఒక వైపు తాత్కాలికంగా వాహనాలు నిలుపుకునేలా అధికారులు అంగీకరి ంచారన్నారు. ఎమ్మెల్యే సహాయ, సహకారాలతో తాము తాత్కాలిక పార్కింగ్ స్థలంను చదునుచేసి, లైటింగ్ సౌకర్యంను ఏర్పాటు చేశామన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

నాణ్యమైన విద్య అందించాలి

రాజంపేట : మన ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ప్రిన్సిపాల్స్, కళాశాలల యాజమాన్యాలు కృషిచేయాలని ఏఐటీఎస్ అధినేత చొప్పాగంగిరెడ్డి అన్నారు. శనివారం ఏఐటీఎస్‌లో జాతీయ విద్యావిధానం సదస్సులో ఆయన పాల్గొన్నారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ మన ప్రాంత విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్తూ అవస్థలు పడుతున్నారన్నారు.వారికి నాణ్యమైన, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి, అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సంఘసేవకుడు భూమన శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ మన ప్రాంతంలో మట్టిలో మాణిక్యాలు ఉన్నారన్నారు. అందుకు నిదర్శనంగా ఈ ప్రాంతం నుంచి ఎందరో ఐఏఎస్‌లు,ఐపీఎస్‌లు. ఉన్నతాధికారులు కాగలిగారన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ సిబ్బంది, వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్, మేనేజ్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీఎస్ అధినేత చొప్పాగంగిరెడ్డి

సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయండి

లక్కిరెడ్డిపల్లి : ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ ఆఫీసర్ రఘురాం పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లెలోని 11వ షాపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆజాదీకా అమృత మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతిరేషన్ షాపును తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సంక్రాంతికి పండగకు కందిపప్పు, పంచదార అందిస్తున్నామన్నారు. అన్నమయ్య జిల్లాలో కొత్తగా 2464 రేషన్ కార్డులు మంజూరయ్యాయని, కొత్త రేషన్ కార్డుకు కూడా నిత్యావసర సరుకులు అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీనివాసులు, ఎన్ఫోర్స్‌మెంట్ డీటీ ఉస్మాన్ సాబ్, డీలర్ లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.